

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శనివారం 31, 32, 36 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. 49వ డివిజన్ తంగెళ్లమూడి, జంగారెడ్డిగూడెం రోడ్లో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవన్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, పలువురు నగర నాయకులు పాల్గొన్నారు.

నా 'నో'..!



నానో యూరియాను రైతులకు బలవంతంగా అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆర్‌బికె, సొసైటీల్లో విక్రయాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఎరువుల బస్తాలు కావాలంటే నానో యూరియా బాటిల్స్ కొనుగోలు చేయాలని నిబంధనలు పెడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. యూరియా ఎరువుకు నానో ప్రత్యామ్నాయం కాదంటూ రైతులు నొక్కి చెబుతున్నారు. పూర్తిస్థాయి సాంకేతిక అనుమతులు లేకుండా నానో యూరియాను మార్కెట్లోకి తెచ్చారన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

- నానో యూరియాపై రైతుల విముఖత
- ఆర్‌బికె,సొసైటీల్లో విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి
- యూరియాకు సరికాదంటున్న రైతులు
- పూర్తిసాంకేతిక అనుమతులు రాకుండా మార్కెట్లోకంటూ విమర్శలు
- ఖరీఫ్‌లో అమ్మకాలకు 2,500 బాటిల్స్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయ రంగంలో యూరియా ఎరువుకు బదులుగా లిక్విడ్ రూపంలోని నానో యూరియా వాడలంటూ కేంద్రం ప్రభుత్వం రైతులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తోంది. నానో యూరియా వాడేందుకు రైతులు తీవ్ర విముఖత వ్యక్తం చేస్తున్నా లక్ష్య పెట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా రైతాంగంలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జిల్లా రైతులు ఎక్కువగా పలుకులుగా ఉన్న యూరియానే వ్యవసాయంలో వాడతారు. యూరియా ఎరువుకు ఇస్తున్న సబ్సిడీ నుంచి తప్పుకోవాలని మోడీ సర్కార్ ఆలోచనకు దిగింది. లిక్విడ్ రూపంలో ఉన్న నానో యూరియాను మార్కెట్లోకి తెచ్చింది. దీనికి పూర్తిస్థాయిలో సాంకేతిక అనుమతులు రాకుండానే మార్కెట్లోకి తెచ్చారనన్న విమర్శలు సైతం ఉన్నాయి. లిక్విడ్ రూపంలో ఉన్న నానో యూరియా అర లీటర్ బాటిల్స్ రూపంలో మార్కెట్లోకి తెచ్చారు. ఎకరాకు ఒక బాటిల్ వాడితే సరిపోతుందని, అవసరమైతే మాత్రమే మరో బాటిల్స్ ఉపయోగించాలని సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 16 లక్షల ఎకరాల్లో వ్యవసాయ సాగు సాగుతోంది. వరి, పామాయిల్, మామిడి, పొగాకు, మొక్కజొన్న వంటి అనేక రకాల పంటలను రైతులు పండిస్తున్నారు. వ్యవసాయ సాగులో యూరియా ఎరువుకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. వరిసాగులో కనీసంగా ఎకరాకు రెండు బస్తాల వరకూ ప్రతి సీజన్‌లో రైతులు వినియోగిస్తారు. ఉద్యానవన పంటల్లో మరింత ఎక్కువగా యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది. నానో యూరియా వద్దని రైతులు చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మార్క్ఫెడ్ ద్వారా ఏటా సహకార సంఘాలు (సొసైటీలు), ఆర్‌బికెలకు టార్గెట్లు పెట్టి అప్పగిస్తోంది. దీంతో సొసైటీ సిబ్బందికి ఏం చేయాలో తెలీక రైతులకు అంటగట్టేందుకు అనేక నిబంధనలు తెరపైకి తెస్తున్నారు. సొసైటీలు, ఆర్‌బికెల్లో యూరియాతోపాటు, డిఎపి వంటి ఇతర ఎరువులు కొనుగోలు చేసే రైతులకు నానో యూరియా కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. గడిచిన ఖరీఫ్‌లో జిల్లాలో 2,500 నానో యూరియా బాటిల్స్‌ను మార్క్ఫెడ్ ద్వారా సొసైటీలకు, ఆర్‌బికెలకు ఇచ్చారు. రైతులు నానో యూరియా వాడేందుకు ఇష్టపడకపోవడంతో చాలా చోట్ల నిల్వ ఉండిపోయినట్లు తెలిసింది. రబీలో వాటిని, కొత్తగా మరికొన్ని బాటిల్స్ అంటగట్టాలని చూస్తున్నారు. నానో యూరియా అర లీటర్ బాటిల్ ఖరీదు రూ.200 ఉంది. యూరియా బస్తా ఖరీదు రూ.260 పలుకుతోంది. పలుకుల యూరియా వాడేందుకు మాత్రమే రైతులు మక్కువ చూపుతుండడంతో నానో యూరియా విక్రయాలు సాగడం లేదు. దీంతో రైతులపై ఒత్తిడి తెచ్చి మరీ నానో యూరియా విక్రయించేందుకు తెగ ఆరాటపడుతున్నారు. నానో యూరియాకు సంబంధించి పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చాయో లేదో ఇప్పటికీ స్పష్టత లేకుండా పోయింది. ఈ యూరియా వాడకంపై తమపై ఒత్తిడి తీసుకురావొద్దంటూ రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.



మాట్లాడుతున్న జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు

ఉద్యోగులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిల సాధనకై ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు, అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే మెరుపు సమ్మెకు వెనుకాడబోమని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు తెలిపారు. ఆర్థిక బకాయిల కోసం జెఎసి చేపట్టిన దశలవారీ ఆందోళనల్లో భాగంగా శనివారం ఉద్యోగులు స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పట్ల అవలంబిస్తున్న తీరుకు తాము అనేకసార్లు మంత్రివర్గ ఉప సంఘాన్ని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లోనూ చర్చించి చీఫ్ సెక్రటరీని కలిసి వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. అనేక రూపాల్లో ఆందోళనలు చేశామని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, జిపిఎఫ్ లోన్లకు పెడితే అవి సకాలంలో రాకపోవడం, జిఎల్ఐ లోన్ల సర్వర్లు పనిచేయకపోవడం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ రాకపోవడం తదితర సమస్యలను ప్రభుత్వానికి విన్నవించినా నేటికీ స్పందన లేదన్నారు. 12వ పిఆర్‌సికి సంబంధించి ఐఆర్ ఇవ్వాలని కోరినా ప్రభుత్వం దిగి రాలేదన్నారు. 58 నెలలుగా ప్రభుత్వానికి అన్ని రకాలుగా ఉద్యోగులు సహకరిస్తూ వచ్చారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు 12వ పిఆర్‌సికి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి లక్షలాదిమందితో నిరసన తెలియజేస్తామని, అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే మెరుపు సమ్మె చేయటానికి కూడా వెనకాడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జెఎసి కన్వీనర్ రామారావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.రవికుమార్, ముస్తఫా ఆలీ, పిఆర్‌టియు ఛైర్మన్ పువ్వా ఆంజనేయులు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీధర్ రాజు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఏక మొత్తంలో ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఏళ్ల తరబడి బకాయిలు పెండింగ్‌లో ఉంటే తమ కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించే వరకూ ఆందోళన కొనసాగుతుందని, ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు తెలుసుకోవాలని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కెవిఎస్.ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు సిఆర్‌రెడ్డి అటానమస్ కళాశాల వద్ద నెహ్రూ యువ కేంద్ర స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా 16 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు వారు మరణిస్తుండడం చాలా బాధాకరమన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు సైన్లు, ట్రాఫిక్ లైట్లను అనుసరించడంతో పాటు ఒకే లైనును అనుసరించాలని, రహదారి కూడళ్లను దాటేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని తెలిపారు. రోడ్డుకు ఎప్పుడూ ఎడమవైపు ఫుట్‌పాత్‌పై నడవాలని, రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాస్ వద్ద దాటడం చాల ఉత్తమమని తెలిపారు. అలాగే రోడ్డు దాటే సమయంలో ముందుగా కుడి వైపు చూస్తూ, ఆ తర్వాత ఎడమ వైపు చూసి జాగ్రత్తగా రోడ్డును దాటడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు కెవిఎస్.ప్రసాద్, జి.ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్ర సంస్థ యూత్ వాలంటీర్ పాయం సింధు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే నిరాహార దీక్ష చేస్తా

శ్రీహరిపురం సర్పంచి విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇటీవల కాలంలో శ్రీహరిపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వెంటనే అధికారులు తొలగించాలని లేకుంటే నిరాహార దీక్ష చేస్తానని శ్రీహరిపురం గ్రామ సర్పంఎతీ పరసా విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో అనధికారికంగా ఎక్కడపడితే అక్కడ ఇష్టరాజ్యంగా కొందరు వ్యక్తులు అక్రమంగా స్థలాలను కబ్జా చేస్తూ పక్కా కట్టడాలు నిర్మిస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా వర్షాకాలంలో గ్రామంలో మురుగునీరు బయటికి వెళ్లే అవకాశం లేకుండా పోతోందన్నారు. వీటిని తొలగించాలని డిఎల్‌పిఒ, ఎంపిడిఒ, తహశీల్దార్, కార్యదర్శి తదితర అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. పంచాయతీ నుంచి ఆక్రమణలు తొలగించాలని నోటీసులు ఇచ్చినప్పటికీ సదరు వ్యక్తులు ఏమీ పట్టించుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలన్నారు. లేని పక్షంలో సోమవారం నుంచి అక్రమ నిర్మాణలు తొలగించే వరకు తాను నిరాహార దీక్ష చేస్తానని చెప్పారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం కైకరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో భూ హక్కుల చట్టంపై రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్య హక్కుల చట్టం -2022 పేరుతో 2023 అక్టోబరు 31న జారీ చేసిన జిఒ 512 ద్వారా తీసుకొచ్చిన చట్టంలో రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే అత్యంత ప్రమాదకర నిబంధనలు ఉన్నాయన్నారు. వ్యవసాయ భూములు, నివాస స్థలాలు, భవనాలు తదితర అన్ని రకాల స్థిరాస్తులపై హక్కులను నిర్ధారించి టైటిల్ రిజిస్టర్లు నమోదు చేసే అధికారాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించడం వల్ల రాజకీయ నాయకుల జోక్యం పెరిగి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పారు. ఈ చట్టంలో సెక్షన్ 38 ప్రకారం టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, భూ హక్కు అప్పిలేట్ ఆఫీసర్‌కు నిర్ణయాధికారం కలిగిన ఏ విషయంలోనైనా సివిల్ కోర్టులకు జోక్యం చేసుకునే అధికారం లేదన్నారు. సెక్షన్ 25 ప్రకారం ఆస్తి యజమాని మరణిస్తే వారసుడు ఎవరనేది రెవెన్యూ అధికారులే నిర్ణయిస్తారని, ఇప్పటివరకూ రెవెన్యూ అధికారుల చర్యలపై కోర్టులు తీర్పులు చెప్పడం జరుగుతోందని, ఈ చట్టం అమలు తర్వాత రెవెన్యూ అధికారుల సర్టిఫికెట్ ఉంటేనే కోర్టులు తీర్పులు చెప్పే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ధోరణి అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ భూ హక్కు చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కూనే శ్రీరామ్మూర్తి, ఆకుల వీర్రాజు, వర్రే శ్రీరాములు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి


డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్



మాట్లాడుతున్న డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని డిపిఒ, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. శనివారం బుట్టాయగూడెం మండల మహిళా సమైక్య ఎపిఎం ఎస్‌వివి పద్మావతి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘం, మహిళా సమైక్య, విఒ లీడర్స్‌కు ఇవిఎం యంత్రాలు, ఓటు హక్కు వినియోగంపై స్థానిక ఐకెపి కార్యాలయం వద్ద స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటర్లను చైతన్యపరిచి 90శాతం పైబడి పోలింగ్ నమోదయ్యే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓటు ద్వారా మంచి నాయకుడును ఎన్నుకొని సమాజ అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపినిచ్చారు. 45 రోజుల స్వీప్ ప్రణాళిక అమలును ఆయన వివరించి మహిళా సహకారంతో జిల్లాలో ఏథికల్ ఓటింగ్ శాతం అన్ని ప్రాంతాల్లో పెరగాలన్నారు. ఓటర్లు రిజిస్ట్రేషన్, ఇవిఎమ్ వినియోగం, ఓటింగ్ విధానం తదితర అంశాలలో ప్రజలను చైతన్య పర్చడానికి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా మాధ్యమాలను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. ప్రజాస్వామ్యంలో మానవ హక్కుల కోసం ఏవిధంగా పోరాడుతామో అదేవిధంగా ఓటు హక్కు వినియోగించుకోవడం కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. రెవిన్యూ డివిజనల్ అధికారి కె.అద్దయ్య మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, పోలవరం పరిధిలో ఓటర్ టర్నవుట్ పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు వారి అభీష్టంమేరకు ప్రశాంతంగా, సజావుగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా స్వీప్ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు మాట్లాడుతూ 10 జిల్లాలో 30 రోజుల పాటు ఇవిఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో బెల్ ఇంజనీర్లు తనిఖీ చేయడం జరిగిందన్నారు. నామినేషన్ల ముందు ఒకసారి, గుర్తులు కేటాయించబడిన అనంతరం ర్యాండమైజేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మార్చి 31 వరకు నిర్వహించే స్వీప్ కార్యక్రమ కార్యాచరణకు డిఆర్‌డిఎ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. అనంతరం బుట్టాయగూడెం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వీప్ అమలులో భాగంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం డిపిఒ ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం ఎంపిడిపి ప్రవీణ్ కుమార్, డిపిఎం సుబ్బారావు, ఎపిఎం పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముదినేపల్లి: ఉత్సాహభరిత వాతావరణంలో వారంతా ఒక్కటయ్యారు. కొంచెం అటు ఇటుగా ప్రస్తుతం వారి వయస్సు యాభై.. కాని పదిహేను సంవత్సరాల ప్రాయానికి వెళ్లి పోయారు. సందడి చేశారు. ఆడి పాడారు. ముదినేపల్లి మండలం పెదపాలపర్రు ఈదర శోభనాద్రి చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987 సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసిన వారంతా శనివారం గ్రామ వేదికగా రీయూనియన్ అయ్యారు. వారి కలయిక మరో వసంతం గుర్తుండి పోయేలా అన్ని ఏర్పాట్లు చేశారు. విందు, వినోదం, సామాజిక స్పృహ, దాతృత్వం ఇలా అన్ని అంశాలకు సమ ప్రాధాన్యతను ఇస్తూ 37 సంవత్సరాల క్రితం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయలు చళ్లగుళ్ల రామారావు, కళ్యాణపు ప్రేమలతలను ఘనంగా సత్కరించారు. నాటి చిత్రాలలో ప్రత్యేకంగా రూపొందించిన మెమొంటోలను బహుకరించి ఆశీర్వాదం తీసుకున్నారు. పదవ తరగతి నాటి మధుర ఘట్టాలను నెమరు వేసుకోవటంతో పాటు, ఈ ముప్ఫై ఏడు సంవత్సరాలలో వారు ఎదిగిన క్రమం, జీవితంలో ఎదురైన ఆటుపోట్లు, విజయాలు, ఉన్నత పదవులు పరస్పరం పంచుకున్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే కలవాలని స్నేహ మాధుర్యాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. సాయంత్రం ఈదర శోభనాద్రి చౌదరి కాంశ్య విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. పాఠశాల ఆవరణలో తమ కలయికకు గుర్తుగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ పట్ల తమకున్న సానుకూల దృక్పధాన్ని చాటుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శాంత కుమారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీతారామయ్య, బి.శ్రీనివాస్, నాగేంద్రబాబు, రామ్మోహన్, వేణుగోపాల్, సంకురాత్రి శ్రీను, తాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన అధ్యాయానికి జగన్మోహన్‌రెడ్డి నాంది

ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - ముసునూరు

నూతన అధ్యాయానికి నాంది పలికిన వ్యక్తి మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శనివారం మండలంలోని రమణక్కపేట, అక్కి రెడ్డిగూడెం, సూరేపల్లి, బస్వావరప్పాడు, గుళ్లపూడి, చెక్కపల్లి, వలసపల్లి, పలు గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభోత్సవం, జలజీవన్ మిషన్ ద్వారా నూతన గ్రాంటు ద్వారా పలు గ్రామాల్లో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నవరత్నాల పేరిట పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారన్నారు. ఆదేవిధంగా గ్రామ స్థాయిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్‌నెస్ సెంటర్, నూతన భవనాలు నిర్మించి అందరికి అందుబాటులో సేవలందించడం జగన్‌మోహన్‌రెడ్డి గొప్పతనం అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావ్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పేరం కృష్ణ, రంగు ధనలక్ష్మిగాంధీ, కొర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చలో విజయవాడకు అనుమతి లేదు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

పోలీసు వారి అనుమతులు లేనటువంటి కార్యక్రమాల్లో పాల్గొంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌పి మేరీ ప్రశాంతి అన్నారు. జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో చలో విజయవాడ వెళ్లడానికి సిద్ధంగా ఉన్న సిపిఎస్ ఉద్యోగులకు అనుమతి లేదని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌పి తెలియజేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో కోడిపందాలు, పేకాట, జూదం, నాటు సారాయి వంటి చట్ట వ్యతిరేక పనులు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముసునూరు ఎస్ఐ పి.వాసు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వలసపల్లి గ్రామంలో అక్రమంగా నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వికలాంగులకు అండగా 'హీల్'



కృత్రిమ అవయవాలతో వికలాంగులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పుట్టుకతో కాని, ప్రమాదవశాత్తుకాని అవయవాలు కోల్పోయిన వారికి మండల పరిధిలోని తోటపల్లిలోని ఎలిజబెత్ ఫాంటన్ లెగసీ ఆఫ్ హోప్ కృత్రిమ అవయవ కేంద్రం అండగా నిలుస్తుందని ఎంవి.నారాయణ అన్నారు. హీల్ సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుడివాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు లాగిశెట్టి ద్రాక్షాయని అందజేసిన విరాళంతో ఐదుగురు వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, సంస్థ డైరెక్టర్లు పి.కృష్ణమోహన్, కె.రామారావు, వై.అంకమ్మ చౌదరి, సిఇఒ కె.అజయ్ కుమార్, సీనియర్ టెక్నిషియన్ కె.చిన్నాలు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శాశ్వత న్యాయ పీఠ సేవలపైన సంబంధిత అధికారులతో ప్రజా ప్రయోజన సేవల శాశ్వత న్యాయ పీఠం ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, విద్యా, వైద్య, జాతీయ ఉపాధి హామీ పథకం, రియల్ ఎస్టేట్ మొదలైన సేవలలో లోపం జరిగిన కేసులను ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందు నిమిత్తం ఎటువంటి రుసుము వసూలు చేయబడదని, కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ చేయడం గాని, సాక్షులను విచారించి తీర్పు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ రెండు నెలల్లో పూర్తి చేయడం జరుగుతుందని, కావున ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు.

నిరుపేద కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రంలో నివసిస్తున్న అనిసెట్టి లక్ష్మి ప్రభాకర్ శర్మ, ఉదయభవాని దంపతుల నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి బుట్టాయగూడెం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో కుటుంబ పోషణకు అవసరమైన నిత్యావసర సరుకులు, కూరగాయలు, రూ.2 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఏపియుటియు జిల్లా కోశాధికారి జక్కుల దాసు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు ఫ్రెండ్స్ ఎప్పుడు ముందుంటుందని, సేవా కార్యక్రమాలలో బుట్టాయగూడెం ఫ్రెండ్స్ తనదైన ముద్ర వేసుకుంటుందని ఆయన తెలిపారు. ఇటువంటి సేవా, సహాయక కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్కరూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కోమిరి ఆనంద్, ఎమ్.శ్రీరామ్ ప్రసాద్, ఎస్.క్రాంతినాథ్, గంజి మధుబాబు, ఎస్.కృష్ణమోహన్, పి.మురళి, డి.ఫణి, మర్రి రమేష్, కారం భాస్కర్, ఎస్.రామకృష్ణ, ఎ.నాగాజీ, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విద్యార్థులంతా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువులో మంచి ఉత్తీర్ణత సాధించాలని వార్డ్ మెంబర్ పూలపల్లి రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక 3వ వార్డులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద వార్షికోత్సవ వేడుకను ప్రధానోపాధ్యాయులు యు.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణమంతా సందడి నెలకొంది. క్లాస్ ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.సుశీల, సిహెచ్.రాజ్యలక్ష్మి, పి.కనకమహాలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మిరియాల రమేష్, వైస్ చైర్మన్ తానేటి పార్వతి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'దొరల పాలనకు స్వస్తి చెప్పాలి'

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గంలో దొరల పాలనకు స్వస్తి చెప్పాలంటే సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని ఎంఎల్‌సి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో మండల టిడిపి అధ్యక్షులు దేవినేని ధర్మారావు ఆధ్వర్యంలో మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరిట పేదలకు కొంతమేర నగదు జమ చేస్తూ, దానికి రెండింతలు మద్యం పేరిట వసూలు చేస్తున్నారన్నారు. వైసిపి పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. వైసిపికి రాజీనామా చేసి టిడిపిలోకి చేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, పర్వతనేని గంగాధరరావు, ఆట్లూరి రమేష్, కొల్లి గంగారామ్, చిలుకూరి వెంకటేశ్వరరావు, నూతక్కి వేణు, మండలపు ధర్మరాజు, సెంద్రు, కూచిపూడి దేవేంద్ర, మండల బూత్‌ టిడిపి సర్పంచులు, ఎంపిటిసి నాయకులు పాల్గొన్నారు.

వసంతకుమార్ స్నేహానికి విలువనిచ్చే వ్యక్తి

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - భీమడోలు

వట్టి వసంత కుమార్ స్నేహానికి విలువనిచ్చే వ్యక్తి అని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఎంఎం పురం ఆవాస ప్రాంతంలోని వట్టి వసంత కుమార్ నివాస గృహంలో ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పేరెన్నిక చెందిన స్థానిక ఎంఎల్‌ఎ, రాష్ట్ర మంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అంబటి రాంబాబు, ఎంపి కోటగిరి శ్రీధర్, మాజీ ఎంపీ హర్ష కుమార్, ఎంఎల్‌సి పుప్పాల వాసుబాబు, ఎంఎల్‌ఎ ఆళ్లనాని, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు, యాళ్ల నాని, జనసేన నాయకులు పి.ధర్మరాజు, బి.శ్రీనివాస్‌తో పాటు రాజకీయాలకతీతంగా పలువురు నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

'వైవి.రావును ఆదర్శంగా తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా, ఎపి జెఎసి అమరావతి ప్రధాన కార్యదర్శిగా, ఎఐబిఇఎ అధ్యక్షులుగా పనిచేసిన వైవి రావు పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఏలూరు స్థానిక కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం కపర్ది భవనంలో వైవి రావు ప్రథమ వర్ధంతిని ఎపి టిడి జిల్లా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎపి టిడి జిల్లా చైర్మన్ కెవి రాఘవులు అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా వైవి రావు చిత్రపటానికి ఎపి జెఎసి అమరావతి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ కె.రమేష్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఎఐబిఇఎ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎపి టిడి జిల్లా కార్యదర్శి బి.రాంబాబు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నీతి నిజాయితీతో వైవి రావు ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అభివృద్ధికి, ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఎఐబిఇఎ నిర్మాణానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి టిడి ఏలూరు డిపో నాయకులు వివిఎస్.నారాయణ, వానపల్లి నారాయణ స్వామి పాల్గొన్నారు.

నిత్యం వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు నిత్యం వ్యాయామం చేస్తే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఫిజియోథెరపీ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండలంలోని వలసపల్లి, గోపవరం గ్రామంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు.

నేడు వాలంటీర్లకు అభినందన సభ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8:30గంటలకు వాలంటీర్లకు అభినందన సభ జరుగుతుందని ఎంపిడిఒ ఎన్ఎం.గంగాధర్ రావు శనివారం తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ పాల్గొని వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న పురస్కారాలను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

బస్సుల్లేక బోసిపోయిన బస్టాండ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

అనకాపల్లిలో ఈనెల 18న జరగనున్న సిఎం సిద్ధం సభకు 62 ఆర్‌టిసి బస్సులు తరలించడంతో బస్సుల్లేక బస్టాండ్ వెలవెలబోయింది. ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలకంటే వైసిపి సభలు, సమావేశాలే ముఖ్యమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నేరాలు - ఘోరాలు

17 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఆగిరిపల్లి: ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ పుంచిన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎసిఐ రంజిత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆగిరిపల్లికి చెందిన మాజీ రేషన్ డీలర్ ఉలాస వెంకట్రావు ఆధ్వర్యంలో అక్రమ రేషన్ బియ్యం నిల్వలు వున్నట్లుగా తెలిసిన సమాచారం మేరకు సదరు ఇంటిపై రెవిన్యూ అధికారుల సమక్షంలో దాడి నిర్వహించగా 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, వీఆర్‌ఒ పి.వంశీలు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులపై కేసు

టి.నరసాపురం : కోడి పందేలు ఆడుతున్న 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బందివారిగూడెం గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.1200 నగదు, ఒక కోడిపుంజు, ఒక కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో 'ఓటు' కీలకం

ట్రైనీ కలెక్టర్ భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష

ప్రజాశక్తి - భీమడోలు

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు పాత్ర కీలకమని, ఎన్నికల సమయంలో అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ అన్నపూర్ణ ప్రత్యూష కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం స్వీప్ చైతన్య, అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీని చేపట్టారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటర్లకు ఓటు హక్కు గురించి ప్రాథమిక పరిజ్ఞానాన్ని కలగజేయటం, ఎన్నికలకు ఓటర్లను సిద్ధం చేయటం, ఓటర్ల అక్షరాస్యతను పెంచటం లక్ష్యంగా వివరించారు. ఎంపిడిఒ స్వర్ణలత మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పురుషుల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ పోలింగ్ సమయానికి పురుష ఓటర్లు మాత్రమే ఎక్కువ శాతం తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి మహిళా ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ వరాహలయ్య, వైఎస్ఆర్ క్రాంతి పతం ఎపిఎం సురేష్, పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి పాల్గొన్నారు.



భీమడోలులో అవగాహనా ర్యాలీ

కార్యక్రమంలో ఎపిఎం ఆడమిల్లి రామారావు, పంచాయతీ సెక్రెటరీ దేవ ప్రియుడు, సిసిలు సురేష్, దాసు, దుర్గారావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కు ఎంతో ముఖ్యమని ఎంపిడిఒ కెఎమ్.మంగతాయారు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం డ్వాక్రా మహిళలకు నిర్వహించిన స్వీప్ ఓటర్ల చైతన్య కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ



చాట్రాయిలో అవగాహనా ర్యాలీ

సందర్భంగా వెలుగు కార్యాలయం నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు. మండలంలో పోలింగ్ శాతం పెంచే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ

చాట్రాయి: ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై ఓటర్స్‌కు అవగాహనా, శిక్షణ కార్యక్రమం చాట్రాయిలోని వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అనంతరం కార్యాలయం నుంచి సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు వేయడం మన అందరి బాధ్యత అని నినాదాలతో తెలిపారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో ఎపిఎమ్ టి.శేఖర్, ఎమ్‌డిఒ మంగాకుమారి, ఇఒపిఆర్‌డి మురళీకృష్ణ, సిసిలు, ఎమ్ఎస్ సెక్రటరీ తేల్లూరి సరోజినీ, విఒఎలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో అవగాహనా ర్యాలీ

జంగారెడ్డిగూడెం టౌన్: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ కె.విజయప్రసాద్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం నుంచి జెడ్‌పిహెచ్ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఐసిడిఎస్ ఉద్యోగులు, మండల మహిళ గ్రూప్ సభ్యులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెలుగు కార్యాలయం వద్ద ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ ఆఫీస్ నుంచి మండపం సెంటర్ వరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.సుబ్బారావు, ఎపిఎం కుంటంబాబు, ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కూచిపూడి సాయిరాం, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీ రాజన్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి: ఓటుహక్కు కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌కె.షకీలన్నిసా పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పౌరుని ఆయుధం అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఎఒ కామేశ్వరి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడిందని, తద్వారా బాధ్యతాయుతంగా పనిచేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడానికి ఒక అస్త్రం అని అన్నారు. వెలుగు ఎపిఎం జ్యోతి పాల్గొని ప్రసంగించారు.

ఆగిరిపల్లి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి



ముసునూరులో అవగాహనా కార్యక్రమం

ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగ పర్చుకొనేలా విఒఎ, విఒలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ పండిత శామ్యూల్ అన్నారు. వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో విఒఎలు, విఒ అధ్యక్షులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్, ఇఒపిఆర్‌డి సిహెచ్.శేఖర్, ఎపిఎం బి.రామకృష్ణ, సిసిలు వెంకటరత్నం, అరుణకుమారి, భాగ్యలక్ష్మీ, సిబ్బంది రజిత, రాంబాబు, పలువురు విఒఎలు, విఒ అధ్యక్షులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నూజివీడురూరల్

రాజీమర్గాన కేసులు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కోర్టుల ప్రాంగణంలో నూజివీడు కోర్టుల పరిధిలోని పోలీస్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 9వ తేదీన జరుగు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించడానికి వీలుపడిన కేసులను రాజీ మార్గన పరిష్కరించుకొనేందుకు కక్షిదారులకు అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె పెద సుభాని, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు, రెండవ అదనపు జూనియర్స్ సివిల్ జడ్జి కె.హరిబాబు, నూజివీడు డిఎస్‌పి సిహెచ్.మురళీకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ డ్రోన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యవసాయ డ్రోన్లు కావాల్సిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ముత్యాలరావు శనివారం విలేఖరులకు తెలిపారు. గ్రామ స్థాయిలో ఐదుగురు తక్కువ కాకుండా ఒక గ్రూపుగా ఏర్పడి రైతులు 10 శాతం నగదు చెల్లించి 90 శాతం నగదు బ్యాంక్ నుంచి రుణం పొందవచ్చునని ఆయన తెలిపారు. డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల తక్కువ సమయం, తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో పురుగు మందు పిచికారీ చేయవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు దోహదం

భీమడోలు: మండల పరిధిలో అక్షరాస్యత శాతం పెరిగేందుకు ముఖ్యంగా బాలికా విద్యాభివృద్ధికి విద్యాశాఖ అమలు చేస్తున్న పలు కార్యక్రమాలు దోహదపడుతున్నాయని మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ మండలంలో పరిపాలనపై శిక్షణ పొందుతున్న డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, భీమడోలు ఎంపిడిఒ స్వర్ణలతకు తెలియజేశారు. వారిరువురూ శనివారం మండల వనరుల కేంద్రాన్ని సందర్శించారు. విద్యాశాఖ ద్వారా అమలవుతున్న పలు పథకాలు, ఇతర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు నాడు-నేడు పనులు ప్రగతి, గతంతో పోలిస్తే మెరుగైన ఫలితాలు ఇస్తున్న నాడు-నేడు పనుల వివరాలు, ట్యాబ్‌ల వినియోగం ద్వారా విద్యా బోధన, ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడేందుకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు వివరాలు గురించి తెలియజేశారు. ఇదేవిధంగా గతంలో సిఆర్‌పిలుగా పిలవబడే ప్రస్తుతం సిఆర్‌ఎంటిగా వ్యవహరిస్తున్న సిబ్బంది బాధ్యతలు, మండలాన్ని ఐదు క్లస్టర్లుగా విద్య వ్యాప్తి కోసం అమలు చేస్తున్న అంశాల గురించి వివరించారు.

అగ్ని ప్రమాద బాధితులకు వంట సామాగ్రి అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని అలివేరు గ్రామంలో గురువారం అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన కుంజా కన్నయ్య, దుర్గమ్మ వృద్ధ దంపతులకు తపన ఫౌండేషన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అండగా నిలిచారు. అగ్ని ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్పందించి సుమారు రూ.6 వేల విలువ చేసే వంట సామాగ్రిని అందజేశారు. అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నివాస గృహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ అధికారులకు తెలియజేసి వారికి లబ్ధి చేకూర్చడానికి ప్రయత్నం చేస్తామని బిజెపి పోలవరం నియోజకవర్గం కన్వీనర్ కొండేటి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షురాలు వంకా కాంచనమాల, బుట్టాయగూడెం మండల బిజెపి ప్రధాన కార్యదర్శులు దయ్యాలసీతా రామాంజనేయులు పాల్గొన్నారు.

జోషి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - పోలవరం



ఆర్థికసాయం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రమాదవశాత్తు మరణించిన పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన 104 ఉద్యోగి దేశాబత్తుల జోషి కుటుంబానికి 104 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రూ.3 లక్షల 14 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం గూటాల గ్రామంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఫణి కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ సమక్షంలో యూనియన్ సభ్యులు జోషి తల్లిదండ్రులకు డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 వాహనంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా మొగల్తూరులో విధులు నిర్వహిస్తున్నారని, ఇటీవల ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌కు గురై కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన ఉద్యోగి కుటుంబానికి రాష్ట్రంలో ఉన్న 104 ఉద్యోగులందరూ కలిసి వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడం కోసం సహకరించారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విధులు నిర్వహిస్తూ చనిపోయిన కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు గణేష్, మూర్తి, మూర్తి రాజు, విలియమ్స్, రవి కిషోర్ యూనియన్ నాయకులు రాంబాబు, త్రిమూర్తులు, రాజు, చంద్రశేఖర్, సల్మాన్ ఖాన్, లక్ష్మణ్ మూర్తి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

'బిఎల్‌ఒలను విధుల్లోకి తీసుకోవాలి'

ఏలూరు అర్బన్: రాష్ట్రంలో ఓటర్ లిస్ట్‌లో ఉన్న చిన్న చిన్న పొరపాట్లపై, పేపర్లో స్థానికంగా కొంతమంది ఇస్తున్న ఫిర్యాదులపై కనీసం విచారణ చేయకుండా, బిఎల్‌ఒ విధులు నిర్వహిస్తున్న వారికి షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా నేరుగా జిల్లా కలెక్టర్లు సస్పెండ్ చేయడాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఉద్యోగస్తులు కేవలం ఒక బిఎల్‌ఒ డ్యూటీలు మాత్రమే కాకుండా, వారి విధి నిర్వహణలో అనేక రకమైన విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కానీ కేవలం బిఎల్‌ఒ విధులలో చిన్న, చిన్న పొరపాట్లను సాకుగా చూపి చిన్న ఉద్యోగులను సస్పెన్షన్లకు గురి చేయడం చాలా బాధాకరమన్నారు. ఈ విషయంపై అన్ని జిల్లాల అధికారులు పునరాలోచించి వెంటనే సస్పెండ్ చేసిన బిఎల్‌ఒలను విధుల్లోకి తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 30 మంది బిఎల్‌ఒలను సస్పెండ్ చేయగా ఈ విషయాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సస్పెండ్ చేసిన 30 మంది బిఎల్‌ఒలను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల అధికారులు సస్పెండ్ చేసిన బిఎల్‌ఒలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా బిఎల్‌ఒలందరూ విధులను బహిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని, ఆ విషయాన్ని నేటి యువత గుర్తెరిగి నడుచుకోవాలని బర్డ్స్ అండ్ బ్లౌజెస్ హైస్కూల్ హెచ్ఎం పివి.వరలక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో స్థానిక పాఠశాల ప్రాంగణం నుంచి బోసు బొమ్మ కూడలి మీదుగా పర్యావరణ పరిరక్షణకై విద్యార్థులతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు తమ వంతు కృషి చేయాలని తెలిపారు. అనంతరం కాలుష్య కోరల్లో నేటి మానవ జీవితం ఏ విధంగా మగ్గుతుందో అనే అంశంపై స్థానిక బొమ్మ కూడలి వద్ద విద్యార్థులు మానవహారం నిర్మించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా చెట్లు నాటి, వాటిని పెంచడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని కొద్ది మేరకు నివారించవచ్చునని, ఆ దిశగా ప్రజలు పాటుపడాలని రూపొందించిన ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణలో మొక్కల ఆవశ్యకత గురించి విద్యార్థులకు స్థానిక నర్సరీలో ఫీల్డ్ ట్రిప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

కష్టపడి చదివాను

డాక్టరేట్ పొందిన రాజేంద్రప్రసాద్

చాట్రాయి: నేను ఎంతో కష్టపడి చదివానని, కడు పేదరికంలో నా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కూలీ, నాలి చేసి పూట గడవని పరిస్థితుల్లో చదివించారని రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని పోతనపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబమైన బాణావతు ముత్తమ్మ, వెంకటేశ్వరరావు దంపతులకు నలుగురు సంతానంలో మూడోవాడైన బాణావతు రాజేంద్రప్రసాద్ మిషన్ లెర్నింగ్‌లో పిహెచ్‌డి చేయడంతో ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నంలో డిసెంబర్ 2023లో డాక్టరేట్‌తో గౌరవించింది. ఈ సందర్భంగా శనివారం చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపల్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిద్ధార్థ హైస్కూల్‌లో సన్మానం చేశారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి చదివించారని, వారి శ్రమను, కష్టాన్ని నేను ప్రతిక్షణం గుర్తు చేసుకొని కష్టపడి చదివానన్నారు. ఇందుకు ప్రధాన కారణం నా తల్లిదండ్రులు నాకు ఆదర్శం అని తెలిపారు. అలానే మీరు కూడా చదవాలని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక కన్వీనర్ ఇవి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, కొమ్ము సుజాన్ రావు పాల్గొన్నారు.

వాలంటీర్లను ప్రభుత్వోద్యోగులుగా క్రమబద్ధీకరించాలి

కుక్కునూరు : గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, రాజకీయ ప్రయోజనాలకు వారిని పావులుగా ఉపయోగించరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి యర్లం సాయి కిరణ్ మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ వ్యవస్థ నిష్పక్షపాతంగా పని చేయాలని కోరింది. గ్రామ వాలంటీర్లను ఎన్నికల విధుల్లో ప్రధాన బాధ్యతలు అప్పగించరాదని ఎన్నికల కమీషన్ చెప్పినప్పటికీ ముఖ్యమంత్రి 'మీరే నా భావి లీడర్లు' అని సన్మాన సభలో వ్యాఖ్యానించడం అనుచితం అన్నారు. ఈ వ్యాఖ్యలు ఓటర్లను ప్రలోభ పెట్టడానికే తప్ప మరొకటి కాదన్నారు. నిజంగా వాలంటీర్లపై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే వారిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామ వాలంటీర్లతో రాష్ట్ర ప్రభుత్వం నానా చాకిరీ చేయించుకుంటుందని, అధికార పార్టీ నాయకుల బెదిరింపులతో వాలంటీర్లు దినదినగండంగా గడుపుతున్నారన్నారు. కానీ వారికి నామమాత్రమైన వేతనాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని విమర్శించారు.

వాలంటీర్ల సేవలకు వందనం : ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్

ప్రజాశక్తి - కలిదిండి

సంక్షేమ పథకాల క్యాలెండర్ అమలులో వాలంటీర్ల సేవలకు వందనమని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ అవరణలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పాల్గొని సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలను అందజేశారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు, బత్తిన ఉమామహేశ్వరరావు, మహాదేవ విజయబాబు, ఎఎంసి ఛైర్మన్ కొల్లాటి సత్యన్నారాయణ, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

20న వాహనాల బహిరంగ వేలంపాట

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో పలు ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 17 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలకు ఈనెల 20న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు జీలుగుమిల్లి సిఐ టి.క్రాంతి కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చేసి ఆధార్ కార్డ్, పాన్ కార్డు సమర్పించాలని ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

ఆగిరిపల్లిలో అన్నదానం

ఆగిరిపల్లి: శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరశింహా స్వామి మాఘమాస రథసప్తమి తిరునాళ్ల సందర్భంగా శనివారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. రథోత్సవం సందర్భంగా నిర్వహించిన కోలాటం, బుట్టబొమ్మలు, నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. తిరునాళ్ల సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి చిటికెన మురళీకృష్ణ ఆదేశాల ప్రకారం సిఐ బాల సరేష్‌బాబు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ పటిష్ట బందోబస్తును నిర్వహించారు. తిరునాళ్ల మహోత్సవ వేడుకలు ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.